క్లుప్తంగా

నేడు పోరంకిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: నేడు పోరంకి నారాయణపురం కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా నారాయణపురం కాలనీ, వందడుగుల రోడ్డు, నిడమానూరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని స్థానికులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

27న పేరంటాలమ్మ ఆలయంలో గ్రామసభ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈ నెల 27వ తేదీన సంక్రాంతి మహోత్సవాల నిర్వహణకు గ్రామసభ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం ఆలయంలో సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది కూడా సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామస్తులు, అమ్మవారి వంశస్తులు, దేవాదాయ శాఖాధికారులతో సమావేశం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఉత్సవాల నిర్వహణ, అమ్మవారి గ్రామోత్సవం, ఆలయంలో ఏర్పాట్లు వంటి పలు అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

వైఎస్సార్ బీమా ప్రజలకు వరం



కంకిపాడు: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య బీమా ప్రజలకు గొప్ప వరం అని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ బీమా కార్డుల పంపిణీ శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందేలా సీఎం జగన్ పాటుపడుతున్నారని తెలిపారు. ఆరోగ్య శ్రీ పరిమితి రూ. 25 లక్షలకు పెంచి, ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఎంపీడీఓ పి.అనూష, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్ రమాదేవి, డాక్టర్ సుధా ప్రసూజ, వైస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్‌పై అవగాహన



పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో సర్పంచి గుంటూరు శ్రీనివాస చౌదరి అధ్యక్షతన పీఎం కిసాన్‌పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ డైరెక్టర్ అగ్రికల్చర్(డీడీఏ) ఎం.పద్మావతి మాట్లాడుతూ పొలం ఉండి పీఎం కిసాన్ సాయం అందని రైతులు వెంటనే రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారిణి ఎస్.పద్మావతి మాట్లాడుతూ తగిన పత్రాలతో ఆర్బీకేలకు వెళ్లి రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ, రైతులు, వీఏఏ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు



ఉంగుటూరు: ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో పంచాయతీ కార్యదర్శులకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు జల్‌జీవన్ మిషన్ పథకంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని 27 గ్రామ పంచాయతీలకుగానూ రూ. 15.31 కోట్ల వ్యయంతో 48 తాగునీటి పనులు త్వరలో ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ అమీర్‌బాషా, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి

గన్నవరం: ముక్కోటి ఏకాదశి పర్వదిన వేడుకలను పురస్కరించుకుని గన్నవరం ప్రాంతంలోని వైష్ణవ ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు శనివారం వేకువజాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులుతీరారు. దావాజిగూడెంలోని శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థానంలో శేష వాహనంపై స్వామివారిని భక్తులు వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్నారు. తొలుత ఆలయ అర్చకుడు రామాచార్యులు నేతృత్వంలో స్వామివారికి సుప్రభాత సేవ, విశేష అర్చనలు జరిపారు. ధనుర్మాస గోష్ఠి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులతో కిక్కిరిసిపోయింది. స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం నిమిత్తం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. శ్రీవారికి కొబ్బరి తురుముతో చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. సాయంత్రం స్వామివారికి ఎడ్లబండిపై గ్రామోత్సవం నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్‌లో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం స్వామివారు భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

నున్న గ్రామంలో..

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని ప్రసిద్ధ దేవస్థానం చినకంచిలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం వేకువజాము నుంచే భక్తులు శ్రీ వేంకటేశ్వరస్వామిని ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అష్టలక్ష్మీ సమేత ప్రసన్న శ్రీవెంకటేశ్వరస్వామికి లక్ష తులసీలతో అర్చనలు నిర్వహించారు. అలాగే శనివారం స్వామినాథ స్వామివారి బ్రహ్మోత్సవాలు సాంప్రదాయ బద్ధంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ చేశారు.

బోడపాడు శ్రీ కోదండ రామాలయం, పడమర బజారులోని శ్రీరామాలయం, తూర్పు రామాలయాల్లోనూ, శ్రీ నరసింహస్వామి దేవస్థానం, పాతపాడు గ్రామంలో శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం, విలేజికండ్రికలో శ్రీరామాలయం నందు స్వామి వారిని భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ జరిగింది.



దావాజిగూడెంలో స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు



గన్నవరంలో కొబ్బరి తురుముతో శ్రీవారిని అలంకరిస్తున్న అర్చకుడు

తాడిగడపలో..

పెనమలూరు: తాడిగడప గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ సీతారామ స్వామివారి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేకువజామున సుప్రభాతసేవ, విశేష అర్చన చేశారు. భక్తులకు ఉత్తర ద్వారదర్శనం కల్పించారు. అనంతరం తిరుప్పావై సేవ, దశ హారతులు, వివిధ రకాల పుష్పాలతో పూజలు నిర్వహించారు. పోరంకి శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ఘనంగా చేశారు. గ్రామంలో చెన్నకేశవస్వామివారి ఆలయం, లక్ష్మీపురం శ్రీవెంకటేశ్వర స్వామివారి ఆలయంలో కూడా భక్తులు ఉత్తర ద్వారదర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు చేశారు. మండల పరిధిలో పలు ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు వైష్ణవ ఆలయాల్లో కొలువుదీరిన స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకుని తరించారు. ఉయ్యూరు విష్ణు ఆలయంలో ఏర్పాట్లను ఆలయ చైర్మన్ లోయ చింతయ్య పర్యవేక్షించారు.



తాడిగడప శ్రీసీతారామాలయంలో స్వామివారు



చినకంచిలో స్వామివారిని ఉత్తర ద్వారదర్శనం చేసుకుంటున్న భక్తులు



ఉయ్యూరులో ఉత్తర ద్వారదర్శనం చేసుకుంటున్న భక్తులు

కోనేరు ట్రస్ట్‌కు రూ. 1.50 లక్షల విరాళం



పెనమలూరు: కోనేరు ట్రస్ట్ పేద విద్యార్థులకు చేస్తున్న సేవలకు మద్దతుగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర రూ 1.50 లక్షలు ఆర్థిక సాయం అందించింది. ఈ మేరకు బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్ రూ 1.50 లక్షల చెక్కును కోనేరు ట్రస్ట్ ప్రతినిధులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా కోనేరు ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్రబాబు, భీమేశ్వరరావు మాట్లాడుతూ కోనేరు ట్రస్ట్ 2017లో గోసాలలో కోనేరు సుబ్బయ్య అధ్యక్షతన ప్రారంభించామని చెప్పారు. ఇప్పటి వరకు ప్రతిభావంతులైన 135 మంది విద్యార్థులకు ట్రస్ట్ ద్వారా రూ 12.35 లక్షలు ఉపకార వేతనాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ట్రస్టీ వాసుదేవరావు, నార్ల మాలతీ, శివాజీ, నాగేశ్వరరావు, రవీంద్రనాథ్ ఠాగూర్ పాల్గొన్నారు.

సాయి మందిరానికి గోవు అందజేత

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక శ్రీభగవాన్ షిర్డీ సాయిబాబా మందిరానికి శనివారం దాత అల్లూరి శ్రీనివాసరాజు, సుజాత దంపతులు ఆవు, దూడను బహూకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వలివేటి శ్రీనివాస శర్మ ఆవు దూడలకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మందిర గౌరవాధ్యక్షులు పిల్లి లక్ష్మీ తులసి, పీవీఎల్ఎన్‌రాజు , మందిర అధ్యక్షుడు వైవీ శివాజీ, ఎం.బాలవర్ధనరావు, విష్ణు సహస్రనామ పారాయణ మండలి మధురానగర్ శాఖ అధ్యక్షుడు హేమ శివసత్య ప్రసాద్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో క్రీడాకారులు సత్తా చాటాలి



పెనమలూరులో విద్యార్థులతో కలిసి ర్యాలీ చేస్తున్న ఎంపీడీఓ సునీతాశర్మ



మారథాన్‌లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా'లో క్రీడాకారులు సత్తా చాటాలని ఎంపీడీఓ సునీతాశర్మ అన్నారు. పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి శనివారం ఆమె ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రాని ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి నిర్వహిస్తోందని మొత్తం ఐదు క్రీడల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. మండల పరిధిలో 1615 మంది పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. ప్రతీ క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని సత్తా చాటాలని చెప్పారు. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులు రాష్ట్ర పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ లోయ శివశంకర్‌రావు, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, ఎంఈఓ కనకమహాలక్ష్మి, హెచ్‌ఎం వై.దుర్గాభవాని, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడిగడపలో..

తాడిగడప మున్సిపాలిటీలో ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహించటానికి ఏర్పాట్లు చేశారు. తాడిగడప మున్సిపాలిటీలో 3333 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో కూడా ఈ నెల 26 నుంచి క్రీడలు నిర్వహించనున్నారు.

గన్నవరంలో మారథాన్

గన్నవరం: ఆడుదాం ఆంధ్రా పోటీలను విజయవంతం చేయాలని కోరుతూ గన్నవరంలో శనివారం మారథాన్ నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ అనగాని రవి జెండా ఊపి మారథాన్‌ను ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, మండల పరిషత్ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, విద్యార్థులు రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, ఎంపీడీఓ ఇ.సత్యకుమార్, ఈవోపీఆర్డీ పి.వెంకటేశ్వరమ్మ, నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త ధనియాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న బైక్

కంకిపాడు: లారీని బైక్ ఢీకొన్న సంఘటన విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై గోసాల ప్రధాన సెంటర్‌లో శనివారం చోటుచేసుకుంది.సేకరించిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి కంకిపాడు వైపు వస్తున్న ట్యాంకర్ లారీ గోసాల సెంటర్‌లో యు టర్న్ తీసుకునేందుకు ఆగింది. వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొంది. బైక్‌పై ప్రయాణిస్తున్న రామవరప్పాడుకు చెందిన ఐ.అనిల్‌కుమార్, ప్రదీప్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్సులో వైద్యం నిమిత్తం కంకిపాడు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి అత్యవసర వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు.

బైక్ చోరీపై కేసు నమోదు

పెనమలూరు: తాడిగడప సెంటర్‌లో బైక్ చోరీ అవడంపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ చిట్టినగర్‌కు చెందిన దుర్గా వెంకట సాయిసందీప్ ఈ నెల 19వ తేదీన తాడిగడప సెంటర్‌లో ఉంటున్న మిత్రుడు సోహెల్ రూమ్‌కు బైక్‌పై రాత్రి వచ్చాడు. అతను బైక్ రూమ్ ఎదుట పార్క్ చేసి కొద్ది సమయం తర్వాత బయటకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: పోరంకిలో వృద్ధురాలు అదృశ్యంపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి శ్రీనివాస నగర్ శ్రీసాయిచరణ్ నిలయానికి చెందిన సునీత తల్లి వల్లభనేని అరుణ కుమారి(63) శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆరోగ్య పరిస్థితి సరిగాలేదు. తన తల్లి కనిపించడం లేదంటూ కుమార్తె సునీత ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు



కంకిపాడులో ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ప్రతి గడపకూ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. తొలుత గంగానమ్మ, అంకమ్మతల్లి ఆలయాల్లో ఎమ్మెల్యే పార్థసారథి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలుతో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ, సంక్షేమ పథకాల బ్రోచర్లను పంపిణీ చేశారు. ప్రజల నుంచి వ్యక్తమైన సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో సమీక్షించారు. డ్వాక్రా సంఘంలో నిధులు గోల్‌మాల్‌పై కేసు నమోదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ సంక్షేమ పాలన సాగిస్తున్నారని చెప్పారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురద చల్లేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు వాస్తవాలను తెలుసుకుని సంక్షేమ ప్రభుత్వానికి బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బాకీ రమణ, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, ఎంపీటీసీ సభ్యుడు కోనా కిషోర్, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, వైస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిషోర్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్.రమాదేవి, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, సీహెచ్‌సీ చైర్మన్ ఎం.కుటుంబరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్ బాబు, పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్ కార్డియోవాస్క్యులర్ లైఫ్ సపోర్ట్‌పై శిక్షణ



శిక్షణ ఇస్తున్న ప్రొఫెసర్ కళ్యాణ్‌చక్రవర్తి

గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో శనివారం మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ కార్డియోవాస్క్యులర్ లైఫ్ సపోర్ట్(ఏసీఎల్ఎస్) అంశంపై పీజీ, ఎంబీబీఎస్ విద్యార్థులకు శిక్షణ, అవగాహన కార్యక్రమం జరిగింది. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ సి.నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని కార్డియాక్ సమస్యలపై స్పందించాల్సిన విధానాలు వివరించారు. రోగుల శ్వాసకోశ నిర్బంధాన్ని గుర్తించడం, శ్వాస కోశ అరెస్టును దాని నిర్వహణ ముందస్తుగా గమనించడం చేయాలన్నారు. సీపీఆర్ నాణ్యతను నిరంతరం అంచనా వేయడం ద్వారా గుండె ప్రతిస్పందన పర్యవేక్షించాలని చెప్పారు. అడ్వాన్స్‌డ్ కార్డియోవాస్క్యులర్ లైఫ్ సపోర్ట్ శిక్షణతో రోగుల ప్రాణాలు నిలబెట్టవచ్చునని వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రంగారావు మాట్లాడుతూ డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల విద్యార్థులకు విస్తృత నైపుణ్యాలు కల్పించేందుకు ఈ శిక్షణను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీఎల్ఎస్ కోర్సు కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.కళ్యాణ్‌చక్రవర్తి, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం



ఆదర్శ రైతు సత్యనారాయణను సన్మానిస్తున్న మానవత సభ్యులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: జాతీయ రైతు దినోత్సవాన్ని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ ఆరోగ్యకరమైన పంటలను సాగు చేస్తున్న పల్లెర్లమూడికి చెందిన రైతు కంభంపాటి సత్యనారాయణను ఆదర్శ రైతుగా గుర్తించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దేశానికి వెన్నుముక రైతేనని వక్తలు కొనియాడారు. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల సుబ్బాచారి, కోళ్లేపల్లి నారాయణరావు, వడ్డి రాజేశ్వరరావు, గంటా సత్యనారాయణ, జన్యావుల సత్యనారాయణ, దయాల ప్రభాకరరావు, కొండలరావు పాల్గొన్నారు.

చినఓగిరాల, ఆకునూరు గ్రామాల్లో..

ఉయ్యూరు: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని చినఓగిరాల, ఆకునూరు గ్రామాల్లో జాతీయ రైతు దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో విద్యార్థులతో కలిసి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. క్లబ్ ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, కిషోర్, దీనవాహి ప్రసాద్, అబ్దుల్‌హసన్ పాల్గొన్నారు. అలాగే ఏజీ అండ్ ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో రైతు దినోత్సవం సందర్భంగా ఉత్తమ రైతులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం ఎంతో అవసరం



పెనమలూరు: కళాశాలల అభివృద్ధికి, జూనియర్ విద్యార్థుల మార్గదర్శకానికి పూర్వ విద్యార్థుల సహకారం చాలా అవసరమని కానూరు పీవీపీ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు అన్నారు. కాలేజీలో పూర్వ విద్యార్థుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీబాబు మాట్లాడుతూ కళాశాలలు, పరిశ్రమలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడానికి పూర్వ విద్యార్థుల సహకారం అవసరమని చెప్పారు. ప్రతి పూర్వ విద్యార్థి జూనియర్‌లకు మార్గదర్శకులుగా ఉండాలని సూచించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సత్యేంద్రనాథ్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల కలయిక కోసం 5 చాప్టర్లు ప్రారంభించామని తెలిపారు. సమావేశంలో పూర్వ విద్యార్థుల సభ్యులు ఎ.మన్మోహన, ఎ.అనుపమ, బి.నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌కు ముస్తాబైన చర్చిలు



నలంద సెమీ క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు



కానూరులో విద్యుత్ దీపాలతో మౌంట్ కార్మెల్ చర్చి

పెనమలూరు: క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవడానికి మండల పరిధిలోని చర్చిలు ముస్తాబయ్యాయి. మండల పరిధిలో దాదాపు 50కి పైగా చర్చిలు ఉన్నాయి. క్రిస్మస్ సందర్భంగా కానూరు మౌంట్ కార్మెల్ చర్చిలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్రీస్తు జననం ఎలా జరిగిందో తెలియజేసే విధంగా బొమ్మలు, పాకలు, స్టార్లు ఏర్పాటు చేశారు. అలాగే పోరంకి బీజేఆర్‌నగర్‌లో ఉన్న చర్చిలు సైతం విద్యుత్ దీపాలు, స్టార్లతో ముస్తాబయ్యాయి. పెనమలూరు అంబేడ్కర్‌నగర్, వణుకూరు, గోసాల, గంగూరు, తాడిగడప, కానూరు, యనమలకుదురు ప్రాంతాల్లో కూడా క్రిస్మస్ వేడుకలు నిర్వహించడానికి చర్చిలు సిద్ధం చేశారు.

నలందలో సెమీ క్రిస్మస్..

కంకిపాడు: ఈడుపుగల్లులోని నలంద విద్యానికేతన్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ బాలస్వామి క్రీస్తు సందేశాన్ని వినిపించారు. అనంతరం చిన్నారులతో కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఉత్సాహంగా డీపీఎస్ వార్షికోత్సవం



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలల్లో విద్యార్థుల ప్రదర్శన అబ్బురపరిచింది. ముఖ్య అతిథిగా నాగార్జున యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ పి.రాజశేఖర్ హాజరై ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రాజశేఖర్ మాట్లాడుతూ భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవడానికి విద్యార్థులకు తగినంత స్వేచ్ఛ నివ్వాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సోషల్ మీడియా దుష్ప్రభావం విద్యార్థులపై పడుతుందని, తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ రీజనల్ ఆఫీసర్ శేఖర్‌చంద్ర, పాఠశాల వైస్‌చైర్మన్ పరిమి నరేంద్రబాబు, డైరెక్టర్ సునంద, పరిమి పవన్‌చంద్, కడియాల ప్రవీణ్‌కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ భువనేశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.